# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

గురువారం । 24 । ఆగస్టు । 2023 । పేజీలు : 6


## విద్యా పెంపుకు ఉన్నతి కార్యక్రమం అమలు

- 6నుంచి 9 వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమం
- గర్రెపల్లిలో ప్రధానోపాధ్యాయులకు ఉన్నతి అమలుపై శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



4 లో

పెద్దపల్లి,ఆగస్టు 23 (మనం ప్రతినిధి) : దివ్యాంగుల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపుతుందని పెద్దపల్లి దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్.ఆర్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు అదనంగా పెన్షన్ పెంపుదల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పథకాల రూపంలో అన్ని వర్గాలకు ఆర్థిక లబ్ధిని అందజేస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. పెరిగిన పెన్షన్‌తో దివ్యాంగుల కుటుంబాల్లో నూతన వెలుగు వచ్చిందని,దేశంలో ఎక్కడలేని విధంగా దివ్యాంగులకు సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలుచేస్తున్నామని అన్నారు. 4016 పెన్షన్



# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న రాష్ట్ర ప్రభుత్వం

- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా చర్యలు
- పెద్దపల్లి నియోజకవర్గంలో 6080 మంది దివ్యాంగులకు 4016 పెంచిన పెన్షన్ అమలు
- పారదర్శకంగా గృహలక్ష్మీ పథకం అమలు
- దివ్యాంగులకు పెన్షన్ పెంపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్



తో నియోజకవర్గంలో దాదాపు 6080 మంది దివ్యాంగులకు ప్రతి నెల 2 కోట్ల 44 లక్షల 17 వేల 280 రూపాయలు అందిస్తుందని, ప్రభుత్వ పరమైన సంక్షేమ పథకాల్లో వికలాంగులకు ప్రత్యేక రాయితీ కల్పిస్తుందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మానవీయకోణంతో సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని, మిగతా 2లో..

## మద్యం విక్రయ కేంద్రాల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలి

### సిపి సుబ్బారాయుడు




కరీంనగర్ క్రైం, ఆగస్టు 23 (మనం న్యూస్): కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా కొనసాగుతున్న బార్లు, మద్యం దుకాణాలు పర్మిట్ రూముల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ ఎల్. సుబ్బరాయుడు హెచ్చరించారు. బార్లు, మద్యం దుకాణాలు, పర్మిట్ రూంలో మిగతా 6లో..

## ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో

# సమన్వయంతో పని చేయాలి

### జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 23 (మనం న్యూస్ ): ప్రజల సంక్షేమం, జిల్లా అభివృద్ధి కొరకు ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలులో అధికార యంత్రాంగం, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో పని చేయాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశానికి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, లతో కలిసి హాజరయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజాపరిషత్ చైర్పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన సంక్షేమా భివృద్ధి పనులను అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మిగతా 2లో..



## మహిళా కాంగ్రెస్ మండలాధ్యక్షురాలిగా లావణ్య



హుజురాబాద్ రూరల్, ఆగస్టు 23 (మనం న్యూస్): హుజూరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా లంకదాసరి లావణ్య నియమితులయ్యారు. ఈ మేరకు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ బల్మూరు వెంకట్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా లావణ్యను కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ ఏఐసీసీ మెంబర్ క్రిస్టోఫర్ తివారి తో పాటు జిల్లా నాయకులు అభినందించారు. అనంతరం లావణ్య మాట్లాడుతూ రాబోతున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ని నియోజకవర్గస్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేయడంతో పాటు పార్టీ గెలుపు కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

## డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం ఎమ్మెల్యే ఇంటి ముందు బిజెపి నిరసన



వేములవాడ టౌన్, ఆగస్ట్ 23 (మనం న్యూస్): డబుల్ బెడ్ రూం ఇండ్లు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరసిస్తూ బుధవారం బిజెపి ఆధ్వర్యంలో వేములవాడ ఎమ్మెల్యే రమేష్ బాబు నివాసం ముందు ఆందోళన నిర్వహించారు. కోరుట్ల బస్టాండ్ నుండి ర్యాలీగా ఎమ్మెల్యే ఇంటి వద్దకు చేరుకున్న బిజెపి శ్రేణులు ఆయన నివాసమైన సంగీత నిలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అర్హులైన వారికి వెంటనే డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వైఫల్యం కారణంగానే డబుల్ బెడ్ రూంలు అందదడం లేదని మండిపడ్డారు. అనంతరం పోలీసులు ఎమ్మెల్యే ఇంటి వద్దకు చేరుకొని నిరసనను అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులకు పార్టీ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకురాలు తుల ఉమ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న రాష్ట్ర ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి..

ఎవరు అడగకపోయినప్పటికీ దివ్యాంగుల పెన్షన్ వేయి రూపాయలు పెంచారని,దేశంలోని మరే రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పెన్షన్,సంక్షేమ పథకాలు అమలులేవని ఎమ్మెల్యే అన్నారు. ఆడపిల్లలకు మేనమామై కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలతో ముఖ్యమంత్రి అదుకుంటున్నారని ,గర్భిణీ స్త్రీల కోసం కేసీఆర్ కిట్,కేసీఆర్ న్యూట్రిషన్ పథకాలను అమలు చేస్తున్నారని,విద్యార్థులకు రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని,రైతు సంక్షేమం దిశగా రైతుబంధు ,రైతుబీమా ,రైతు రుణమాఫీ,24 గంటలు విద్యుత్ వంటి పథకాలు అమలుచేస్తున్నారని అన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని,ఒకవైపు జీవనోపాధికి భరోసా కల్పిస్తూ మరోక వైపు ఆసరా పెన్షన్ రూపంలో వారి జీవితానికి ఆర్థిక భరోసా అందిస్తున్న సీఎం కేసీఆర్ కు రాష్ట్ర దివ్యాంగుల సమాజం తరపున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని తెలిపారు. గృహలక్ష్మీ పథకం కింద ప్రతి గ్రామంలో విచారణ చేపట్టి అర్హులను అధికారులు ఎంపిక చేయడం జరుగుతుందని,పూర్తి పారదర్శకంగా గృహ లక్ష్మీ పథకాన్ని అమలు చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో 97 వేల మంది లబ్దిదారులకు ఆసరా పెన్షన్ల క్రింద ప్రతి నెల 22 కోట్లకు పైగా నిధులు అందిస్తున్నామని అన్నారు. వీరిలో 13 వేల మంది దివ్యాంగులు పెన్షన్ పొందుతున్నారని,వారికి ప్రభుత్వం వెయ్యి రూపాయల పెన్షన్ పెంచి జూలై మాసం నుంచి 4016 రూపాయల పెన్షన్ అందిస్తుందని అన్నారు. దివ్యాంగులకు పెన్షన్‌తో పాటు అవసరమైన పరికరాలను సైతం ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో సరఫరా చేస్తుందని,ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని,వివిధ ప్రభుత్వ పథకాలలో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించి లబ్ధి చేకూర్చడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. జిల్లాలో ప్రతినెల సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామని,అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఆసరా పెన్షన్ అందించే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్ దివ్యాంగులకు పెన్షన్ పెంపు ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్,పెద్దపల్లి ఎంపిపి స్రవంతి శ్రీనివాస్, సుల్తానాబాద్ ఎంపిపి బాలాజీరావు,సంబంధిత అధికారులు ,ప్రజాప్రతినిధులు, ఎంపిడివోలు,తదితరులు పాల్గొన్నారు.




## పిజి ప్రవేశ పరీక్షలో వికాస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 23 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర సీపీ గేట్ ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని చెన్నవేణి సుప్రియ రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా సుప్రియను కాలేజ్ యాజమాన్యం దిడ్డి శ్రీనివాస్, గుగ్గిల్ల జగన్ గౌడ్, శాతవాహన యూనివర్సిటీ కామర్స్ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్ లు బుధవారం శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో సమన్వయంతో పని చేయాలి

మొదటి పేజీ తరువాయి..

పూర్తి స్థాయిలో జరిగేలా కృషి చేయాలని తెలిపారు. జిల్లాలోని 311 గ్రామపంచాయతీలలో 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, త్రాగునీరు, సి.సి. రోడ్లు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు పారిశుద్ధ్యం, తెలంగాణకు హరితహారం కార్యక్రమాల నిర్వహణలో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, తాగునీరు, ఆహార పదార్థాలు, శుభ్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఆయా మండలాలు, గ్రామపంచాయతీల అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని తెలిపారు. వర్షాకాలం కావడంతో విద్యుత్ శాఖ అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, రాత్రి వేళలలో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ దీపాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు




అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీరు అందించాలని, పైప్ లైన్ల మరమ్మత్తు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదివాసీల సంక్షేమం, కవ్వాల్ అభయారణ్యం, కవ్వాల్ వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అటవీ సిబ్బందితో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు పోషణ్ అభియాన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రహదారులు-భవనాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రహదారులు, అంతర్గత రహదారులు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు చేపట్టి నిర్దేశిత లక్ష్యాలను సాధించే దిశగా అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల సంబంధిత పనుల నిర్దేశిత లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, మిషన్ భగీరథ ఈ. ఈ. అంజన్ రావు, విద్యుత్ శాఖ ఎస్. ఈ. శేషారావు, జిల్లా అధికారులు, జెడ్.పి.టి.సి.లు, ఎం.పి.పి.లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వ నిర్ణయాలతో దేశానికి విశ్వఖ్యాతి

**- దశాబ్దాలుగా దేశాన్ని పీడిస్తున్న అనేక సమస్యలకు మోడీ ప్రభుత్వం విముక్తి కల్పించింది**

**- బిజెపితోనే సుపరిపాలన**

**- మోదీ నాయకత్వానికి దేశ ప్రజల సంపూర్ణ మద్దతు**

**- డబుల్ ఇంజన్ సర్కార్ తో తెలంగాణకు ఉజ్వల భవిష్యత్తు**

**: అస్సాం ఎమ్మెల్యే ధర్మేశ్వర్ కోన్వర్**



హుజురాబాద్ రూరల్, ఆగస్టు 23 (మనం న్యూస్): ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా భారత దేశం విశ్వఖ్యాతి సాధించిందని అస్సాం రాష్ట్ర సోనారి నియోజకవర్గ శాసనసభ్యులు ధర్మేశ్వర్ కోన్వర్ అన్నారు. బిజెపి మోడీ ప్రభుత్వం పని తీరుకు దేశ ప్రజలందరూ జై కొడుతున్నారని, అందుకే రెండు పర్యాయలు ఏకధాటిగా కేంద్రంలో బిజెపి కి అధికారం కట్టబెట్టారన్నారు. దేశ హితం కోసం తీసుకున్న అనేక నిర్ణయాలు ప్రజలు స్వాగతించారని, దశాబ్దాల కాలం గా దేశాన్ని పీడిస్తోన్న అనేక సమస్యలకు మోడీ ప్రభుత్వం ముగింపు పలికింద న్నారు. ముఖ్యంగా370 ఆర్టికల్ , అయోధ్య రామ మందిర నిర్మాణం, నేటి యూనిఫామ్ సివిల్ కోడ్ లాంటి అనేక సాసోపేత నిర్ణయాలను అమలు చేసిన ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ధర్మేశ్వర్ బుధవారం స్థానిక బిజెపి శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని వమ్ము చేయకుండా కేంద్రం లోని మోడీ ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏళ్లుగా అవినీతి రహిత విజయవం తమైన పాలన కొనసాగించిందన్నారు. ఇన్నేళ్లుగా బిజెపి ప్రభుత్వం ప్రజల విశ్వాసం చూరగొన్నదని , ప్రధాని మోదీ నాయకత్వానికి, సుపరిపాలనకు ప్రజలంతా సంపూర్ణ మద్దతు తెలియజేయడం సంతోషకరమన్నారు. మోడీ ప్రభుత్వం దేశ కోసమే అనుక్షణం ఆలోచన చేస్తుందన్నారు. బిజెపి మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు నేడు దేశ దిశ దశ లను మార్చాయని, అన్ని విషయాల్లో మన దేశం ప్రపంచంతో పోటీ పడుతుందని , కేంద్రంలోని బిజెపి పాలనా విధానాలతో దేశ ఖ్యాతి విశ్వంలో మార్మోగుతుందన్నారు. నేడు తొమ్మిదేళ్ల బిజెపి మోడీ ప్రభుత్వ పాలనలో ప్రపంచంలోని అగ్రరాజ్యాల వరుసలో భారతదేశం కూడా నిలిచిందన్నారు. మోడీ ప్రభుత్వ పాలన తీరును ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయని, దీంతో దేశం కీర్తి విశ్వంలో మారుమో గుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా 370 ఆర్టికల్, త్రిబుల్ తలాక్, అయోధ్య రామ మందిరం, వన్ నేషన్ వన్ రేషన్, డిజిటల్ ఇండియా, విదేశాంగ విధానం, సిఏ ఏ, యు సిసి, మేకిన్ ఇండియా, నేషనల్ హైవేస్ , ఆత్మ నిర్భర్ భారత్, స్వచ్ఛభారత్ , 220 ఉచిత కరోనా వ్యాక్సిన్ , 80 కోట్ల మందికి మూడేళ్లుగా ఉచితరేషన్ , నూతన విద్యా విధానం , ఆయుష్మాన్ భారత్ లాంటి అనేక నిర్ణయాలు దేశానికి ఎంతో మేలు చేశాయని తెలిపారు. దేశంలోని అన్ని రంగాలను బలోపేతం చేయడానికి మోడీ ప్రభుత్వం విశేష కృషి చేసిందని ,ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరంగా శ్రమిస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం దేశంలోని ప్రతి ఒక్కరు గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు . బిజెపి మోడీ ప్రభుత్వ ఇన్నేళ్ల సుపరిపాలనపై, అభివృద్ధి సంక్షేమం , పథకాలను ప్రతి ఇంటికి తెలియజేసే బాధ్యత బిజెపి శ్రేణులపై ఎంతగానో ఉందన్నారు . అందుకే మోడీ ప్రభుత్వ పనితీరును, దేశ ప్రగతి కోసం తీసుకున్న నిర్ణయాలను, హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తెలియజేయాల్సిన బాధ్యత నియోజకవర్గ బిజెపి శ్రేణులపైనే ఉందన్నారు. ప్రజలంతా బిజెపి మోడీ ప్రభుత్వ పాలనపై నమ్మకం విశ్వాసంతో ఉన్నారని ధర్మేశ్వర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని కెసిఆర్ ప్రభుత్వం పై ప్రజలు విసిగిపోయి ఉన్నారని , స్థానిక బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి వ్యవహార శైలి సరిగా లేదని, దౌర్జన్యాలు బెదిరింపులను ప్రజలు సైతం అసహ్యించుకుంటున్నారన్నారు. కేంద్రం, రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాలు డబల్ ఇంజన్ సర్కార్ తో తెలంగాణ రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రాష్ట్రంలో, హుజురాబాద్ నియోజకవర్గం లో కాషాయ జెండా ఎగరవేయడానికి నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు అంతా సమిష్టి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, ప్రవాస్ యోజన కో-ఆర్డినేటర్ పుప్పల రఘు, బిజెపి అధికార ప్రతినిధులు జెల్ల సుధాకర్, మాసాడి ముత్యంరావు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు కళ్లెపు రేణుక, స్వల్పకాలిక్ విస్తారక్ సుధీర్, సీనియర్ నాయకులు కళ్లేపు సుధాకర్ రావు, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చా అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్చార్జిలు, బూత్ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు రాజీనామా చేసిన

# మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్

### కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమని ప్రకటన



కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 23 (మనం న్యూస్): బిఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం స్థానిక ప్రెస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి కెసిఆర్ తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధ కలిగిందని చెప్పారు. ప్రాధాన్యత లేని పార్టీలో కొనసాగడం ఇష్టం లేక రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ ప్రజలు మార్పు కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలో తగిన ప్రాధాన్యత కరవవడంతోనే స్థానిక నాయకులు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి లేని నాయకునిగా కొనసాగుతున్నానని, ప్రజల ఆశీస్సులు ఉంటే కరీంనగర్ నుండి బరిలో నిలిచి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. పదిహేను రోజుల్లో తన సన్నిహితులు, అనుచరులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆహ్వానిస్తే చేరడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. బిఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి 2018 అసెంబ్లీ ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో తమ వంతు కృషి చేశానని వెల్లడించారు. బిఆర్ఎస్ పార్టీలో సరైన ప్రాధాన్యత లేదని చాలామంది అసంతృప్తితో ఉన్నట్లు వెల్లడించారు. స్మార్ట్ సిటీ నిధులతోనే కరీంనగర్ అభివృద్ధి చెందుతుందని అయినా కూడా అంతర్గత రోడ్లు ఇప్పటికీ అలాగే ఉండడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.



## చంద్రయాన్-3 సక్సెస్‌తో

# బిజెపి శ్రేణుల సంబరాలు

కరీంనగర్, ఆగస్టు 23 (మనం న్యూస్): చంద్రయాన్-3 మిషన్ సక్సెస్ కావడం పట్ల కరీంనగర్ జిల్లా బిజెపి ఆధ్వర్యం లో బుధవారం సాయంత్రం నగరంలోని తెలంగాణ చౌక్ లో భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి శ్రేణులు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలో భారత్ చరిత్ర సృష్టించిందని, చంద్రుని దక్షిణ ధృవం పై అడుగుపెట్టిన తొలి దేశంగా చరిత్ర పుటల్లో నిలిచిందన్నారు. చంద్రయాన్ 3 విజయవంతం ప్రతి భారతీయునికి గర్వకారణమన్నారు. అగ్ర దేశాలు సైతం చంద్రుని దక్షిణ ధృవంపై అడుగు పెట్టే సాహసం నేటికి చేయలేదని, చంద్రయాన్ 2 విఫలమైనా పట్టుదలతో ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3తో తామెంటో ప్రపంచానికి నిరూపించారన్నారు. అంతరిక్ష పరిశోధన రంగంలో విజయం సాధించడానికి కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం శాస్త్రవేత్తలను వెన్ను తట్టి ప్రోత్సహించిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బాస సత్యనారాయణ రావు,కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్, కటకం లోకేష్, కార్పొరేటర్లు రాపర్తి విజయ, కొల గాని శ్రీనివాస్, కచ్చు రవి, పెద్దపల్లి జితేందర్, బండ రమణారెడ్డి,నాగసముద్రం ప్రవీణ్, మునిగంటి కుమార్,మామిడి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దివాకర్‌రావుకు ఘన

## స్వాగతం పలికిన గులాబీ శ్రేణులు



మంచిర్యాల, 23 ఆగస్టు (మనం న్యూస్ ): మంచిర్యాల నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి అవకాశం దక్కించుకుని బుధవారం హైదరాబాద్ నుంచి మంచిర్యాల కు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్ రావు కు నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ముందుగా మంచిర్యాల జిల్లా సరిహద్దు గూడెం గుట్ట గోదావరి వద్ద స్వాగతం పలికారు.అక్కడినుండి బైక్ ర్యాలీ తో గూడెంగుట్ట సత్యనార్యాయణ స్వామిని ఎమ్మెల్యే దర్శనం చేసుకుని, పూజలు చేసి జయ జయ ధ్వానాలతో బైక్ ర్యాలీతో బయలుదేరారు. లక్షెట్టిపేట్, దండేపల్లి, పాత మంచిర్యాల రహదారుల వెంట మంచిర్యాల పట్టణంలోకి వచ్చి ప్రధాన కూడళ్ళలో తిరుగుతూ, అందరికి దండాలు పెడుతూ ఇంటికి చేరుకున్నారు. బైక్ ర్యాలీలో బిఆర్ఎస్ జండాలు రెపరెపలాడాయి. ఈ బైక్ ర్యాలీ లో కోల్ బెల్ట్ ప్రాంతాలు శ్రీరాంపూర్, నస్పూర్ లనుంచి బిఆర్ఎస్ అనుబంధ సింగరేణి కార్మికులు, నాయకులు కూడా పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గాదె సత్యం, సురేష్ బల్దావ, సుధమళ్ళ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ అసెంబ్లీ టికెట్‌కు కోమటిరెడ్డి దరఖాస్తు



కరీంనగర్, ఆగస్టు 23 మనం న్యూస్ః పిసిసి సభ్యులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచేందుకు కాంగ్రెస్ అధిష్టానానికి బుధవారం దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్ లో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌కు దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గత ముప్పై సంవత్సరాలుగా పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేయడమే కాకుండా గత తొమ్మిది సంవత్సరాలుగా పార్టీకి ఒక సైనికుడిలా ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎప్పడికప్పుడు ఎండగడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ కరీంనగర్ లో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం కోసం కృషి చేస్తున్న తనకు పార్టీ తప్పకుండా టికెట్ కేటాయిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### బిందేశ్వరీ ప్రసాద్ మండల్ జయంతిని

## విజయవంతం చేయాలి

### మండల్ రాష్ట్రీయ సమితి వ్యవస్థాపకులు హరిప్రసాద్



కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 23 (మనం న్యూస్)ః ఈ నెల 25వ తేదీన జరుగనున్న బిందేశ్వరీ ప్రసాద్ మండల్ 105వ జయంతి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల్ రాష్ట్రీయ సమితి వ్యవస్థాపకులు గుంజపడుగు హరిప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలో ఎంఆర్ఎస్ వ్యవస్థాపక నాయకులు మేకల చంద్రశేఖర్ యాదవ్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరిప్రసాద్ మాట్లాడుతూ బిసిలకు 27 శాతం రిజర్వేషన్ రావటానికి విశేషంగా కృషి చేసిన బిపి మండల్ జయంతిని ప్రతి జిల్లా, ప్రతి మండలంలో జరిగే విధంగా బిసి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. బిపి మండల్ చేసిన 39 సిఫారసులను అమలు చేయాలని, అదేవిధంగా భారత పార్లమెంట్ లో బిసి రిజర్వేషన్ అమోదం తెలిసిన అగస్టు 7 ను బిసి దినోత్సవంగా ప్రకటించాలనే ముఖ్య ఉద్దేశంతో మండల్ రాష్ట్రీయ సమితి ఆవిర్భావం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో బిసి కుల సంఘాలను, బిసి ప్రజా ప్రతినిధులను, బిసి మేధావులను, బిసి విద్యార్థులను, మహిళలను, బిసి నాయకులను కలుపుకుని పంచాయతి నుండి పార్లమెంట్ స్థాయి వరకు మహా ఉద్యమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఆర్ఎస్ నాయకులు, బిసి కుల సంఘ నాయకులు కలర్ సత్తన్న, సింగిరాల వెంకటస్వామి, జక్కం సంపత్, తూల భాస్కర్ రావు, సాదవేణి వినయ్ కర్రె శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, కుండా మల్లేషం, దాడి సంపత్ యాదవ్, గొల్లపల్లి సుధాకర్, శ్రీరాముల బాల సురేందర్, యాసం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా పెంపుకు ఉన్నతి కార్యక్రమం అమలు

**- 6నుంచి 9 వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమం**

**- హై స్కూల్,కేజీబీవీ,మోడల్ స్కూల్‌లో అమలు**

**- ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ**

**- గర్రెపల్లి లో ప్రధానోపాధ్యాయులకు ఉన్నతి అమలుపై శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**



సుల్తానాబాద్,ఆగస్టు 23 మనం న్యూస్ ః ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యాసన ఫలితాలు పెంపొందించి విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం ఉన్నతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో ఉన్నతిపై ప్రధాన ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యాసన ఫలితాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని,6 నుంచి 9 వ తరగతి విద్యార్థుల కోసం దీనిని రూపొందించారని అన్నారు. జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు,కేజీబీవీ,మోడల్ పాఠశాలల్లో ఉన్నతి కార్యక్రమం అమలు చేయడం జరుగుతుందని,దీనికోసం ముందస్తుగా ప్రధానోపాధ్యాయులకు ఆగస్టు 21 నుంచి 23 వరకు గర్రెపల్లి మోడల్ స్కూల్లో శిక్షణ అందించడం జరిగిందని అన్నారు. ఉన్నతి కార్యక్రమం అవశ్యకత,లక్ష్యాలు విధివిధానాలు, వాచకాలు, బోధనా ప్రణాళికలు వాటి అంశాలపై అవగాహ న కోసం ఉపాధ్యయులకు సైతం అగస్టు 29 నుంచి సెప్టెంబర్ 16 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాలలోని ప్రతి ఒక్క విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి అభ్యాసన పరిజ్ఞానం పెంచాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన ప్రణాళికను రూపొందిం చుకోవాలని, వార్షిక పాఠ్య ప్రణాళిక,పీరియడ్స్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవా లని,ప్రతి పీరియడ్‌లో భాషతో పాటు నాన్ లాంగ్వేజ్ విషయంలో కూడా కొంత సమయాన్ని పిల్లలతో చదివించడానికి కేటాయించాలని అన్నారు. ఉన్నతి కార్యక్రమంలో ఆరు నుంచి తొమ్మిది తరగతి విద్యార్థులకు ప్రారంభంలో నే బేస్ లైన్ టెస్ట్ నిర్వహించి,పిల్లల స్థాయిని నమోదు చేయాలని ,సబ్జె క్టుల వారీగా నిర్ధేశించిన సామ ర్థ్యాలను పరీక్షించాలని, ప్రధానోపాధ్యాయులు నెలవారీగా నిర్వహించే పాఠశాల స్థాయి సమీక్ష సమావేశం లో పిల్లల ప్రగతిని చర్చించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల అభ్యా సన సామార్థ్యాలు మెరుగుపరిచేందు కు తొలిమెట్టు కార్యక్రమంలాగే ఉ న్నత పాఠశాలలో కూడా విద్యార్థుల పరిస్థితి అంచనా వేస్తూ నిరంతరం పర్యవేక్షించి ఉన్నతి కార్యక్రమాన్ని అమలు చేసి మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధి కారి డి.మాధవి,ఉన్నతి మానిటరింగ్ అధికారి షేక్, ప్రధానోపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.



# నిస్సహాయుల్లో భరోసాను నింపుతోన్న కెసిఆర్

### స్వరాష్ట్రంలో సుపరిపాలన బిఆర్ఎస్‌తోనే సాధ్యం

### మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ

### దివ్యాంగులు, బీడీ టేకేదారులకు పెన్షన్ పత్రాల పంపిణీ

రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 23 (మనం న్యూస్): నిస్సహాయులకు జీవన భద్రతను కల్పించి సిఎం కెసిఆర్ వారిలో భరోసాను నింపుతూ ఆదర్శవంతమైన సుపరిపాలన అందిస్తున్నారని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన దివ్యాంగుల పెన్షన్ 4,016 పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పత్రాలు, బీడీ టేకేదారులకు ఆర్థిక సహాయ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో బుధవారం టీఎస్సీడీసీ చైర్మన్ గూడురి ప్రవీణ్, జడ్పీ చైర్ పర్సన్ నాలకొండ అరుణరాఘవరెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు గడ్డం నరసయ్య,జడ్పీ సీఈవో గౌతం రాజులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కళ మాట్లాడుతూ స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలనను సాగిస్తూ, తెలంగాణను ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఆయన అందిస్తోన్న పథకాలు ప్రతి ఒక్కటి ఒక్కో అని ముత్యం అని, అందులో ఆసరా పెక్షన్ ఒక ఆణిముత్యమని కొనియాడారు. ఆసరా ఫంక్షన్ రూపంలో వృద్ధాప్య పెన్షన్, వితంతు పెన్షన్ లు, నేత కార్మికులు, గీత కార్మికులకు పెన్షన్ లు అందిస్తూ, ఫైలెరియ, డయాలసిస్ , హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు కూడా పెన్షన్ అందిస్తూ, ఒంటరి మహిళలకు బీడీ కార్మికులకు ఇలా అన్ని వర్గాలకు చెందిన నిస్సహాయులకు జీవన భద్రత కల్పిస్తూ ఒక తండ్రి గా, అన్నగా, ఒక కుటుంబ పెద్దగా కడుపున పెట్టుకుని



చూసుకుంటూ భరోసాను కలిగిస్తున్నారని కొనియాడారు. దివ్యాంగుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారి పెన్షన్ మరో వెయ్యి రూపాయలు అదనంగా పెంచి 4వేల16 రూపాయలకు పెంచి వారి జీవితానికి భరోసా కల్పిస్తోన్న కెసిఆర్ ఆదర్శనీయులన్నారు. బీడి పరిశ్రమ రంగంలో కార్మికులకు, పరిశ్రమకు మధ్య వారధిగా పని చేస్తూ ఎంతోమందికి ఉపాధి చూపించడంలో కీలక పాత్ర పోషించే టేకేదారులకు కూడా ఆసరా పెన్షన్ పథకం కింద 2016 రూపాయలు అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఇంతటి గొప్ప నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా ప్రతి ఒక్కరు స్వాగతిస్తూ బిఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని జిందం కళ పిలుపునిచ్చారు.

# పకడ్బందీగా దరఖాస్తు నమోదు చేసేలా ధరణి సహాయ కేంద్రం తోడ్పాటు

### లింక్ డాక్యుమెంట్‌లతో

### పేరు మార్పు కింద దరఖాస్తు చేసుకోవాలి

### ధరణి సహాయ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి,ఆగస్టు 23(మనం ప్రతినిధి) : భూ సమస్యలు ఉన్నవారు ధరణి పోర్టల్ లో పకడ్బందీగా దరఖాస్తు చేసుకకునే విధంగా ధరణి సహాయక కేంద్రం తోడ్పాటు అందిస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ధరణి సహాయక కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి సహాయక కేంద్రం వద్ద అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన పెండ్యాల మహేష్ సమస్యను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వే నెంబర్ 257 లో పట్టా పాస్ పుస్తకంలో తాత పేరుపై ఉన్న భూమి,ధరణిలో నమోదు కాలేదని తెలుపగా,పట్టా పాస్ పుస్తకం,లింక్ డాక్యుమెంట్లతో పేరు మార్పు కింద దరఖాస్తు చేసుకోవాలని,సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించి సమస్య వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ధరణి సహాయక కేంద్రానికి వచ్చే దరఖాస్తుదారులకు సరైన గైడెన్స్ అందిస్తూ ధరణిలో సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన మాడ్యూల్ లలో దరఖాస్తు సమర్పించే విధంగా పకడ్బందీగా గైడెన్స్ అందించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం దిశగా అధికారులు విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు,తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# అట్రాసిటీ కేసులో 30 రోజులు గడుస్తున్నా నిందితున్ని ఆరెస్టు చేయని పోలీసులు

- తక్షణమే నిందితున్ని ఆరెస్టు చేయాలి
- కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ డిమాండ్
-చట్టాలను రక్షించాల్సిన పోలీసులు చట్టాలను నర్వీర్యం చేయడం సబబు కాదు
- సర్పంచ్‌లకే న్యాయం చేయ లేకపోతే సామాన్యులకు ఎలా చేస్తారు



ముత్తారం,ఆగస్టు 23 మనం న్యూస్ : దళిత సర్పంచ్ పులిపాక నగేష్ ను కులం పేరుతో ధూషించిన వ్యక్తి పైన అట్రాసిటి కేసు నమోదు అయి 30 రోజులు గడుస్తున్నప్పటికి నిందితుడికి పోలీస్‌లు ఇప్పటివరకు ఆరెస్టు చేయకపోవడాన్ని తప్పుబడుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ముత్తారం మండలం సీతంపేట గ్రామానికి చెందిన దళిత సర్పంచ్ పులిపాక నగేష్ జూలై 24 సోమవారం రోజున అభివృద్ధి పనులలో భాగంగా స్మశాన వాటిక నిర్మాణం,డంపింగ్ యార్డ్ నిర్మాణం,మొక్కలు నాటడం లాంటి పనులు నిర్వహిస్తుండగా దళితుడు పులిపాక నగేష్ సర్పంచ్ కావడాన్ని జీర్ణించుకోలేని కుల అహంకారి అన్నం రాజమల్లు సర్పంచ్ నగేష్‌ను కులం పేరుతో దూషిస్తూ నానా విధమైన పదజాలంతో అతని ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతూ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నాడు మనస్థాపానికి గురైన సర్పంచ్ కులం పేరుతో దూషించిన వ్యక్తి పైన ముత్తారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి గోదావరిఖని ఏసిపి తుల శ్రీనివాసరావు గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టారని కులం పేరుతో దూషించడం నిజమేనని విచారణలో తేలినప్పటికీ ఇప్పటికీ 30 రోజులు గడుస్తున్నప్పటికీ ఆరెస్టు చేయకపోవడం చాలా బాధాకరమని చట్టాలను రక్షించాల్సిన పోలీసులు చట్టాలను నిర్వీర్యం చేయడం సబబు కాదని గ్రామ ప్రథమ పౌరుడు, రాజ్యాంగబద్ధంగా ఎన్నుకోబడిన దళిత సర్పంచ్ లకే పోలీస్‌లు న్యాయం చేయలేకపోతే సామాన్య జనాలకు ఏ విధంగా న్యాయం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే నిందితున్ని అరెస్టు చేయాలని బాధితునికి మెయింటేనెన్స్ డబ్బులు ఇవ్వాలని లేని పక్షంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని ఆయన అన్నారు.



# మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

సుల్తానాబాద్,ఆగస్టు 23 మనం న్యూస్ : కొత్తగా వచ్చిన సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జునని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ స్థానిక సుల్తానాబాద్ మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులకు 3 నెలలుగా వేతనాలు పెండింగ్ ఉన్నాయని,అదేవిధంగా 7 నెలల ఎరియర్స్ బకాయి ఉన్నాయని,వీటిని వెంటనే చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకొని మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పాక మహేష్,జిల్లా ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి,సుల్తానాబాద్ మున్సిపల్ నాయకులు రమేష్,మల్లేష్, లక్ష్మి, రాజయ్య, పోచయ్య, లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గూటికి కొత్త జైపాల్ రెడ్డి

### కరీంనగర్‌లో అభిమానుల సంబరాలు



కరీంనగర్, ఆగస్టు 23 (మనం న్యూస్): మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. హైదరాబాద్ లోని గాంధీ భవన్‌లో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మానిక్ ఠాక్రే, టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, మిత్ర మండలి సభ్యులు నగరంలో బుధవారం ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కరీంనగర్ లోని జ్యోతి నగర్ మైత్రి టవర్, మంచిర్యాల్ చౌరస్తా , తెలంగాణ చౌక్‌లో సంబరాలు జరుపుకున్న మిత్ర మిత్ర మండలి సభ్యులు, అభిమానులు...బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా మిత్ర మండలి సభ్యులు మాట్లాడుతూ కొత్త జయపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం తమకు చాల సంతోషంగా ఉందన్నారు. ఈ సమయం కోసం ఎన్నో రోజుల నుండి ఎదురు చూస్తున్నామన్నారు. కరీంనగర్ ప్రజలు జైపాల్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆయన గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ కోరారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వెన్నం రజిత రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. జైపాల్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయన గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త జైపాల్ రెడ్డి మిత్ర మండలి సభ్యులు , అభిమానులు పాల్గొన్నారు.

# చెరువు శిఖం భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలి



తిమ్మాపూర్, ఆగస్టు23 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల పరిధిలోని తుమ్మలకుంట చెరువు శిఖం సర్వే నంబర్ 447లోని 19 ఎకరాల,9 గుంటల భూమిని కబ్జా చేసి, చెరువు నామరూపాలు లేకుండా చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొరపల్లి రమణారెడ్డి, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిన్న బోయి నరవి, తిమ్మాపూర్, నల్లగొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు నగనూరు శ్రీనివాస్, మార్క నరసయ్య, నాయకులు రమేష్, రాజిరెడ్డి, కుమార్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సంజయ్‌ని ఆశీర్వదించండి

## ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



కోరుట్ల, ఆగస్టు 23 (మనం న్యూస్): రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా కోరుట్ల ఎన్నికల బరిలో నిలువనున్న తన తనయుడు కల్వకుంట్ల సంజయ్ కుమార్ ను ఆశీర్వదించాలని కోరుట్ల శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అభ్యర్థించారు. బుధవారం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మొదటిసారిగా కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు విచ్చేసిన కల్వకుంట్ల సంజయ్‌కి మెట్‌పల్లి, కోరుట్ల పట్టణ ప్రజలు ఘన స్వాగతం పలికారు. బిఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో మెట్‌పల్లి కోరుట్ల పట్టణంలో ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టారు. ఈ యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. కోరుట్ల పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలతో పాటు కల్వకుంట్ల సంజయ్ ప్రజలకు అభివాదం తెలియజేసి ప్రజా సంక్షేమం కోసం తన తండ్రి ఆలోచనలు, సలహాలు, సూచనలు మేరకు తను ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని పేర్కొన్నారు. కోరుట్ల పట్టణం నంది చౌరస్తా నుండి బయలుదేరిన ప్రజా ఆశీర్వాద యాత్ర కొత్త బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం కోరుట్ల సాయిరాం ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కావేరి గార్డెన్ లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రలో నాయకులు కార్యకర్తలు భారీ పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతూ తాను మూడు పర్యాయాలు ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టారని ఇప్పుడు మా తనయుడు సంజయ్ నీ కూడా నన్ను ఆశీర్వదించినట్లు ఆశీర్వదించండి అని పేర్కొన్నారు అభివృద్ధి సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం కుమారునికి ఎల్లవేళలా తన సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్, వైస్ చైర్మన్ గడ్డమీద పవన్ స్థానిక కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మశాలి శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ



కొత్తపల్లి, ఆగస్టు 23 (మనం న్యూస్): రాష్ట్ర రాజధాని హైదరాబాదలో వచ్చే నెల 3వ తేదీన నిర్వహించనున్న పద్మశాలి శంఖారావం పోస్టర్ ను స్థానిక మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు మెతుకు సత్యం బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు వాసాల రమేష్, మున్సిపల్ ఛైర్మన్ రుద్ర రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లాల క్రిష్ణహరి, నాయకులు కముటం రాజేశం, వేముల చంద్రశేఖర్, స్వర్గం నర్సయ్య, అనుమల్ల సత్యనారాయణ, దూస మునిందర్, వొడ్నాల రవిందర్, చిలుక నర్సప్ప, వేముల సాగర్, వేముల రాజు, సుంకే సత్యం, డిష్ రాజు, గుండేటి శివరంజన్, బైరి శీన్, కట్ల సుధాకర్, పెంటి మురళి, పెంటి శ్రీకాంత్, పెంటి శేఖర్, వేముల శ్రీనివాస్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయాన్-3 విజయంతో కోరాజాన్సన్ స్కూల్‌లో సంబరాలు



కరీంనగర్, ఆగస్టు 23 (మనం న్యూస్): చంద్రయాన్-3 విజయవంతం కావడంతో నగరంలోని కోరా జాన్సన్ పాఠశాలలో బుధవారం సాయంత్రం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. జయహో చంద్రయాన్, జయహో భారత్ అంటూ విద్యార్థిని, విద్యార్థులు ఆనందంగా కేరింతలు కొట్టారు. కోరా జాన్సన్ పాఠశాల యాజమాన్యం చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్ రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ , వంగర సంతోష్ రెడ్డి భారత్ సాధించిన చంద్రయాన్ – 3 విజయంపై ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఇలాంటి ఘనత మన భారత్‌కే సాధ్యమని పేర్కొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రవాస్ అభియాన్



ఇల్లంతకుంట, ఆగస్టు 23 ( మనం న్యూస్): బిజెపి మండల అధ్యక్షులు నాగసముద్రాల సంతోష్ అధ్యక్షతన బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే ప్రవాస్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బిజెపి మండల కమిటీ సభ్యులు, శక్తి కేంద్ర ఇన్చార్జులు, సహ ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా అస్సాం రాష్ట్రానికి చెందిన కమల పూర్ ఎమ్మెల్యే దిగంత కవిత హాజరై పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారు. ఈ మూడు నెలలు కార్యకర్తలంతా సంఘటితంగా కష్టపడి మానకొండూరు నియోజకవర్గంలో బిజెపిని గెలిపించుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలుచేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఒక్క కార్యకర్త గడప గడపకు ప్రచారం చేయాలని సూచించారు. అదే విధంగా రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ కో-ఆర్డినేటర్ గుర్రాల వెంకటరెడ్డి, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, బత్తిని స్వామి, అధికార ప్రతినిధి కొత్త శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తిప్పారావు శ్రవణ్, చెప్యాల గంగాధర్, బొల్లారం ప్రసన్న, గజ్జెల శ్రీనివాస్,రొండ్ల మధుసూదన్,మామిడి హరీష్, కథ మల్లేశం,కాముల్ల ఎల్లయ్య,పుణ్ణి రాజు,ఇట్టి రెడ్డి లక్ష్మా రెడ్డి,ముత్తక్క, పొన్నం కృష్ణ, సూదుల కిషన్ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మద్యం విక్రయ కేంద్రాల వద్ద

## పటిష్ట చర్యలు తీసుకోవాలి

మొదటి పేజీ తరువాయి..

యజమానులు కనీస పర్యవేక్షణ భద్రత చర్యలు తీసుకోకపోవడం వల్ల నేర సంఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. బుధవారం కమిషనరేట్ కేంద్రంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుతో కలిసి సంబంధిత శాఖలకు చెందిన అధికారులు, మద్యం దుకాణాలు, బార్ల యజమానులు, పర్మిట్ రూముల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారాయుడు మాట్లాడుతూ మద్యం విక్రయాలు జరుపుతున్న వ్యాపారులు ఎటువంటి గొడవలు నేర సంఘటనలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం విక్రయాలు జరిగే ప్రతి కేంద్రం వద్ద యజమానులు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఏవైనా గొడవలు ఇతర రకాల సంఘటనలు జరిగేందుకు అవకాశం ఉన్నట్లయితే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. మద్యం విక్రయదారులు ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా నియంత్రణకు చర్యలు తీసుకునే బాధ్యత గల వ్యక్తులను ఏర్పాటు చేయడం వారి బాధ్యతగా గుర్తించాలని తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వివిధ రకాల మద్యం దుకాణాల యజమానులు విచ్చలవిడిగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే వివిధ రకాల సంఘటనలు జరుగుతున్నాయన్నారు. మద్యం విక్రయ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మద్యం విక్రయ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలకు తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు.

## జయహో చంద్రయాన్... జయహో భారత్..

### చంద్రయాన్ 3 విజయంతో వసంత్ వ్యాలీ విద్యార్థులు ర్యాలీ

కరీంనగర్, ఆగస్టు 23 (మనం న్యూస్): భారత్ లో 140 కోట్ల జనాభా ఎదురుచూస్తున్న చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో బుధవారం కరీంనగర్ హనుమాన్ నగర్ లోని వసంత్ వ్యాలీ పాఠశాల విద్యార్థులు త్రివర్ణ పతాకాన్ని చేతబూని హనుమాన్ నగర్ వీధుల వెంట భారత్ విజయాన్ని జయహో భారత్.. జై హో చంద్రయాన్ అనే నినాదంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ స్వరూప బుచ్చిరెడ్డి మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతంతో ప్రపంచ దేశాల్లో భారతదేశం అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. ఇస్రో శాస్త్రవేత్తలను ప్రతి ఒక్క విద్యార్థి ఆదర్శంగా తీసుకుని దేశానికి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న యువకుడికి అండగా నిలిచిన కొండాపూర్ గ్రామస్తులు



చిగురుమామిడి, ఆగస్టు 23 (మనం న్యూస్): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడికి మేమున్నామంటూ అండగా నిలిచారు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామస్తులు. సోషల్ మీడియా వేదికగా 70మంది ముందుకు వచ్చి 62వేల రూపాయలు జమ చేసి బాధిత కుటుంబానికి అందించగా, చిన్ననాటి స్నేహితులు 25వేల రూపాయలు అందించి, ఆ పేద కుటుంబానికి మరింత ధైర్యాన్ని నింపారు. గతంలో నిరుపేద కుటుంబానికి చెందిన గుళ్ల రాజు అనే యువకుడు మృతిచెందగా చిన్నపిల్లలతో కుటుంబాన్ని వెళ్లదీయాల్సిన తల్లికి 2లక్షల 10వేల రూపాయలు జమ చేసి జిల్లాకే ఆదర్శంగా నిలిచారు ఆ గ్రామ యువకులు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బుర్ర హరీష్ అనే యువకుడు శుక్రవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడడంతో ముక్కుకు బలమైన దెబ్బ తగిలింది. గమనించిన స్థానికులు వెంటనే హాస్పిటల్ తరలించారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడం వలన ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్ చేయాలని, ఆపరేషన్ కు పెద్ద మొత్తంలో ఖర్చు అవుద్దని,లేకుంటే ప్రాణాప్రాయం ఉందని డాక్టర్లు తెలిపినట్లు తల్లిదండ్రులు చెప్పారు.తల్లిదండ్రులు నిరుపేదలు,కుటుంబం ఆర్థికంగా లేని వారు,కావడంపైగా తనకు చిన్న పిల్లలు ఉన్నారు.పిల్లల పరిస్థితి చూసి, వారి కుటుంబ పరిస్థితి చూసి కొండాపూర్ గ్రామ వాట్స్ అప్ గ్రూప్ లో ఉన్న గ్రామస్తులను సహాయార్థం అర్జించగా గ్రామ ప్రజలు యువకులు ముందుకు వచ్చి, తోటి గ్రామస్తుడు ప్రమాదంలో ఉన్నాడని చలించి హరీశ్ ఆరోగ్యం బాగుండాలని త్వరగా కోలుకోవాలని ఆశిస్తూన్నారు.తలా ఒకరు ఎంతో కొంత సహాయం చేయడానికి మానవత్వంతో దాదాపుగా 70మంది ముందుకు వచ్చారు.అందరి సహాయంతో 62వేల రూపాయలు జమ చేసి బాధితునికి సోవారం రాత్రి కరీంనగర్ హాస్పిటల్ లో అందించినట్లు కనగండ్ల సతీష్ తెలిపారు.అంతే కాకుండా బాధితుని క్లాస్మేట్స్ దాదాపు 25వేలు అందించారు.గ్రామ సర్పంచ్ పెద్దపల్లి భవాని అరుణ్ పటేల్ ముందుకు వచ్చి బాధితునికి ఎమ్మెల్యే సతీష్ కుమార్ ను సంప్రదించి హాస్పిటల్ లో కావలసిన సహాయ సహకారం అందిస్తా అని తెలిపినట్లు చెప్పారు.ఇలా ఆపదలో ఉన్న ఊరి వ్యక్తికోసం అందరూ ముందుకు వచ్చి సహాయం చేయడం ఎంతో ఆదర్శనీయం అని,ఊరివాళ్ళు ఒకరికి ఒకరు భరోసా ఉంటారు అని,బాధితున్ని ప్రజలకు ఒక ధైర్యాన్ని ఇచ్చారని మండలంలో అందరూ చర్చించుకుంటున్నారు.మనిషికి మనిషి తోడు ఉంటే ఎవరికి అయిన ఎంత కష్టం వచ్చినా ధైర్యంగా ఎదుర్కోని ఆ కష్టం నుండి భయటపడుతారని గ్రామ ప్రజలు అందరు హర్షంవ్యక్తం చేశారు.ఇలానే ప్రతి ఒక్కరు ఒకరికి ఒకరు సహాయం చేస్తూ ముందుకు పోవాలని ఆశాభావం వ్యక్తంచేశారు.